www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 8 ఏప్రిల్ 2024

5

పశ్చిమ గోదావరి



10న తణుకులో టిడిపి, జనసేన ఉమ్మడి సభ

పాల్గొనున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - తణుకు

తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ఎన్నికల బహిరంగ సభ ఈ నెల 10వ తేదీ బుధవారం నాడు తణుకులో నిర్వహిస్తున్నట్లు టిడిపి నేతలు తెలిపారు. పదో తేదీ సాయంత్రం పట్టణంలోని నరేంద్ర సెంటర్‌లో సభ నిర్వహించాలని భావిస్తున్నామని చెప్పారు. ఈ సభలో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పాల్గొనున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రానికి సభా స్థలి, సమయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది ఇక్కడ సభానంతరం చంద్రబాబు, పవన్ తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు పట్టణంలో నిర్వహించే సభలో పాల్గొనున్నారు.

బస్టాండ్లలో నిలువు దోపిడీ..!



ఆర్‌టిసి బస్టాండ్లలో ధరల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా తినుబండారాలు, తాగునీరు, శీతల పానీయాల అమ్మకాలు సాగుతున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడు. దీంతో ప్రయాణికులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

తినుబండారాలు, తాగునీరు, శీతల పానీయాలు అధిక ధరకు విక్రయం

రెండు జిల్లాల్లోనూ అమలుకాని ఎంఆర్‌పి

రూ.20 బిస్కెట్ ప్యాకెట్ రూ.25కు విక్రయం, మిగిలిన వస్తువులు అదే రీతి

ప్రయాణికులు ప్రశ్నిస్తే వస్తువులు విక్రయించకుండా ఇబ్బందులు

తణుకు బస్టాండ్‌లో పరిస్థితి మరింత దారుణం

పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద బస్టాండ్లు ఏడు వరకూ ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు 600కు వరకూ ఆర్‌టిసి బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంటాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల్లో తమ ప్రయాణం సాగిస్తున్నారు. బస్టాండ్లలో తినుబండారాలు, తాగునీరు, శీతల పానీయాలు విక్రయించేందుకు షాపుల ఏర్పాటు ఆర్‌టిసి నిబంధనలకు అనుగుణంగా సాగుతోంది. నిబంధనల ప్రకారం ఆర్‌టిసి బస్టాండ్లలో దుకాణాల్లో వస్తువుల ధరలన్నీ ఎంఆర్‌పికి లోబడే ఉంచి విక్రయించాలనే నిబంధన ఉంది. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. చాలా బస్టాండ్లలో అధిక ధరలకు తినుబండారాలు, తాగునీరు, కూల్‌డ్రింక్స్ విక్రయిస్తూ ప్రయాణికుల నుంచి దోచేస్తున్న పరిస్థితి ఉంది. రూ.20 బిస్కెట్ ప్యాకెట్ రూ.25కు విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్, తాగునీరు బాటిల్స్ సైతం అదనంగా రూ.ఐదు వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఆర్‌టిసి అధికారులు పట్టించుకోకపోవడం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు బస్టాండ్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అధిక ధరలకు విక్రయంపై ప్రశ్నించిన ప్రయాణికులకు వస్తువులు అమ్మకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గట్టిగా మాట్లాడితే మీకు ఎంఆర్‌పికి కావాలంటే క్యాష్ ఇవ్వాలని, ఫోన్ పే వంటివి కుదరదంటూ షరతులు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ప్రయాణికులు వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. వేసవిలో బిస్కెట్స్ వంటివి సైతం ప్రయాణికులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.ఐదు చొప్పున అధికంగా విక్రయించడంతో ప్రయాణికుల నుంచి భారీగా దోచేస్తున్న పరిస్థితి ఉంది. ఒక్కో ప్రయాణికుడు రెండు, మూడు వస్తువులు కొనుగోలు చేస్తే కనీసంగా రూ.15 వరకూ అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఎంఆర్‌పికే విక్రయించాలని నిబంధన ఉన్నప్పటికీ బస్టాండ్లలోని షాపుల్లో ఈ విధంగా విక్రయించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు.

అధికారులు అక్కడే ఉన్నా.. అధిక ధరలే..!

ఆర్‌టిసి బస్టాండ్లలో సంబంధిత అధికారులు, డిపో మేనేజర్ అక్కడే ఉంటారు. అయినప్పటికీ యథేచ్ఛగా ఈ దోపిడీ సాగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. బస్టాండ్లలో దుకాణాలు నడుపుతున్న యజమానులకు, అధికారులకు మధ్య రహస్య ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా అనే విమర్శలు విన్పిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి దుకాణం ముందు వస్తువుల ధరలకు సంబంధించి బోర్డులు ప్రదర్శించాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. దుకాణ దారులు ఎంత చెబితే అంత అన్నట్లు పరిస్థితి తయారైంది. దీనిపై ఆర్‌టిసి జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులను దోపిడీ నుంచి కాపాడాలని అంతా కోరుతున్నారు.

కొత్తూరు జ్యూట్‌మిల్లు క్లోజ్

నిన్నటి వరకూ లేఆఫ్.. నేటి మూత - నోటీసు బోర్డులో పెట్టిన యాజమాన్యం

రోడ్డున పడ్డ సుమారు 1200 మంది కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా నడుస్తున్న కొత్తూరు జ్యూట్‌మిల్లును సోమవారం నుంచి మూసివేస్తున్నట్లు యాజమాన్యం ఆదివారం నోటీసులివ్వడంతో 1200 మంది కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జ్యూట్‌మిల్లు మూసివేత చట్ట విరుద్ధమని, మూసివేతకు యాజమాన్యాలు చెబుతున్న కారణం సహేతుకం కాదని, మిల్లు కొనసాగింపు, కార్మికుల హక్కుల కోసం పోరాడతామని హెచ్చరిస్తున్నాయి.

కృష్ణ హెసియన్స్ పేరుతో కొత్తూరు జ్యూట్‌మిల్ 1996లో ప్రారంభమైంది. వంద సంవత్సరాలుపైబడి చరిత్ర ఉన్న ఏలూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యమే కొత్తూరులో దీనిని ప్రారంభించింది. ప్రారంభంలో మూడు వేల మంది కార్మికులు పని చేయగా క్రమంగా కార్మికుల సంఖ్య తగ్గుతూ నేడు 1235 మంది కార్మికులు పని చేస్తున్నారు. 2022 జనవరి 26న నష్టాల్లో ఉందనే సాకుతో ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేయడంతో సుమారు మూడు వేల మంది కార్మికులు రోడ్డున పడ్డ సంగతి తెలిసిందే. సంవత్సరకాలంగా కార్మిక సంఘాల పోరాటంతో రావాల్సిన నష్టపరిహారాన్ని కార్మికులు సాధించుకున్నారు. అయితే ఉపాధి కోల్పోవడంతో అనేక మంది తోపుడుబండ్లపై కూరగాయలు, పండ్లు వ్యాపారం చేస్తూ, కొంతమంది పెయింటర్లుగా, కొంతమంది కూలీలుగా మారి జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా సంవత్సర కాలంగా తూతూమంత్రంగానే నడుస్తోంది. నష్టాల పేరుతో యాజమాన్యం కార్మికులకు పని కల్పించకుండా అతి కొద్ది మందికి మాత్రమే పని కల్పిస్తూ వస్తోంది. గత నెలలో నార కొరత ఉందంటూ, నార వచ్చిన వెంటనే మిల్లు కొనసాగిస్తామని.. అప్పటి వరకూ అంటే మార్చి 28వ తేదీ నుంచి ఏప్రిల్ ఏడో తేదీ వరకు లేఆఫ్ ప్రకటించారు. అంటే సగం జీతం కార్మికులకు ఇచ్చేలా యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల ప్రకారం ఏప్రిల్ 8న సోమవారం తిరిగి మిల్లు తెరవాల్సి ఉండగా ఎవరూ ఊహించని విధంగా ఒక రోజు ముందు ఆదివారం ముడి సరుకుకు పెట్టుబడి సమకూరలేదని, మిల్లు నష్టాల్లో ఉందని, ఈ పరిస్థితుల్లో మిల్లు నడపలేమని యాజమాన్యం కార్మిక సంఘాలకు, కార్మికులకు నోటీసులు పంపించింది. దీంతో కార్మికులు కంగుతిన్నారు. యాజమాన్యం చెబుతున్న కారణాలు సరికాదని, మిల్లు నష్టాల్లో ఉంటే ముందే కార్మికులకు ఎందుకు తెలియజేయలేదని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం మిల్లు మూసివేయాలంటే మూడు నెలల ముందే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, అలా తీసుకోకుండా మిల్లు మూసివేయడం చట్ట విరుద్ధమని చెబుతున్నారు. యాజమాన్యం మాత్రం కార్మికుల గైర్హాజరు వల్లే మిల్లు నష్టాల్లో ఉందని, కార్మికుల గైర్హాజరు వల్ల సామర్థ్యం మేరకు ఉత్పత్తి జరగడం లేదని, ఈ పరిస్థితుల్లో 2019 నుంచి మూడు షిఫ్టులు పని చేయాల్సిన కార్మికులను రెండు షిఫ్టులకే పరిమితం చేయాల్సి వచ్చిందని చెబుతోంది. 2022-23 సంవత్సరానికి రూ.ఏడు కోట్లు, 2023-24 సంవత్సరానికి రూ.17 కోట్లు నష్టం వచ్చిందని, నెలకు రూ.50 లక్షలు బ్యాంకు వడ్డీ కట్టాల్సి వస్తుందని, నార సరఫరా చేసే కంపెనీలకు కోట్లాది రూపాయలు బకాయి ఉండటంతో ముడిసరుకు వచ్చే పరిస్థితి ఏర్పడిందని, దీంతో మిల్లు తిప్పలేమని నోటీసులో పేర్కొంది. గత నెలలో లేఆఫ్ ప్రకటించినప్పుడే సిఐటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వద్ద సమావేశం నిర్వహించగా మిల్లు నష్టాల్లో ఉందని, పరిస్థితులు చక్కబడితే ఏప్రిల్ 8వ తేదీ నుంచి మిల్లు తిప్పుతామని యాజమాన్యం తెలిపింది. ఈ నేపథ్యంలో ఎనిమిదో తేదీ నుంచి తిరిగి మిల్లు తెలుసుకుంటుందని కార్మికులు ఎదురుచూస్తున్న తరుణంలో ఒక్కసారిగా యాజమాన్యం మిల్లు మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జ్యూట్‌మిల్లును మూసివేసినప్పుడు కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ చేదు అనుభవం నుంచి బయటపడక ముందే కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా మూసివేయడం అన్యాయమని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయంలో కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు.

నష్టాల్లో ఉందని ఎన్నడూ చెప్పలేదు

కోలాపల్లి ఉమాశంకర్ (బుజ్జి), టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు, కొత్తూరు జ్యూట్‌మిల్లు గుర్తింపు సంఘం నేత

కొత్తూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యం మిల్లు నష్టాల్లో ఉందని ఎన్నడూ కార్మికులకుగాని, యూనియన్ నేతలకుగాని తెలియజేయలేదు. ఇప్పుడు నష్టాల్లో ఉందని చెప్పడం సరికాదు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఆకస్మాత్తుగా జ్యూట్‌మిల్లు మూసివేసి కార్మికులను రోడ్డున పడేయటం చట్టవిరుద్ధం. దీనిపై మూడు సంఘాల నేతలు చర్చించుకుని కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడతాం. లేఆఫ్ ఇచ్చి, వెంటనే లాకౌట్ ప్రకటించడం చాలా దుర్మార్గం. మిల్లు నష్టాల్లో ఉందని ముందే మాకు తెలియజేసి ఉంటే కార్మికుల తరపున మేమే ప్రభుత్వానికి తెలియజేసేవాళ్లం. అలా చెప్పకుండా ఇప్పుడు ఒక్కసారే మూసివేస్తున్నామని చెప్పడం దుర్మార్గమైన చర్య. దీనికోసం చివరి వరకు పోరాడతాం. కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తాం.

కొత్తూరు మిల్లు మూసివేత దారుణం

బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కొత్తూరు జ్యూట్‌మిల్లు మూసివేత దారుణం. యాజమాన్య చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. కొంతకాలంగా కార్మికులకు పనులు లేకుండా చేసి ఒక పథకం ప్రకారం మిల్లును అక్రమంగా మూసివేస్తున్నారు. ఏలూరు మిల్లు మూసివేసిన నేపథ్యంలో రియల్ ఎస్టేట్ లాభాలు రుచి మరిగిన యాజమాన్యం కొత్తూరులో కూడా అదే పద్ధతిలో మూసివేసి కార్మికులను బజారున పడేసి లాభాలు పొందాలని చూస్తోంది. ఈ చర్యను ప్రభుత్వం ఆపాలని కోరుతున్నాం. దురుద్దేశంతో యాజమాన్యం మిల్లు మూసివేతకు పాల్పడుతున్నందున అందుకు అనుమతి ఇవ్వకుండా, మరెవరైనా మిల్లును తీసుకొని నడిపించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలి.

ప్రభుత్వ విధానాల ఫలితమే

వి.సాయిబాబు, పి.కిషోర్
కొత్తూరు జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

కొత్తూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యం అకస్మాత్తుగా మిల్లు మూసివేతున్నట్లు నోటీసు బోర్డు ద్వారా తెలియజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. 2022లో ఇదేవిధంగా ఇదే యాజమాన్యం ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేసి ఐదువేల మంది కార్మికుల ఉపాధి దెబ్బతీసింది. నేడు కొత్తూరు జ్యూట్‌మిల్లు అక్రమ మూసివేతతో సుమారు 1250 మంది కార్మికుల ఉపాధి అగమ్యగోచరంగా మారుతోంది. ఇప్పటికే కొత్తూరు మిల్లులో సుమారు సంవత్సర కాలం నుండి కార్మికులకు పని చూపించకుండా యాజమాన్యం కుట్రపూరితంగా ఇప్పటివరకు వ్యవహరించింది. ఏదైనా కంపెనీ మూసివేయాలంటే ఆరు నెలలు ముందుగా కార్మికులకు సమాచారం తెలియజేయాలి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చేయడంతో ప్రయివేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని జ్యూట్ పరిశ్రమను ప్రభుత్వాలు నిలబెట్టి, ఆదుకోవాలి. కొత్తూరు జ్యూట్‌మిల్లును తెరిపించాలి. లేనిపక్షంలో ఇతర కార్మిక సంఘాలను, కార్మికులను కలుపుకుని ఆందోళన చేపడతాం.

18 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

నామినేషన్ వేసే అభ్యర్థులు నిబంధనలు పాటించాలి - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం



సాధారణ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభమై 25వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 26న అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన, 29న నామినేషన్ పత్రాల ఉపసంహరణతో ముగుస్తుందని పేర్కొన్నారు. మే 13న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. 1,463 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంప్, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 120 శాతం ఇవిఎం యంత్రాలు సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటి వద్ద వెబ్ క్యాస్టింగ్, అబ్జర్వర్ల నిఘా ఉంచామని తెలిపారు. సర్వీస్ ఓటర్లు, విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వినియోగించుకునే అంశాలపై అన్ని చర్యలూ తీసుకునామని తెలిపారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులకు మూడు వాహనాలకే అనుమతి ఉందని తెలిపారు. ఆర్ఓ కార్యాలయానికి వంద మీటర్ల వరకూ మాత్రమే వాహనాలకు అనుమతి ఉందని పేర్కొన్నారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులతోపాటు మరో నలుగురు మాత్రమే లోపలికి వెళ్లడానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో అభ్యర్థి నాలుగు నామినేషన్ పత్రాలు వేయడానికి అవకాశం ఉందని తెలిపారు. అఫిడవిట్, ఓటు ధ్రువీకరణ పత్రం, పార్టీ బలపరిస్తే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు నామినేషన్‌తో పాటు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అభ్యర్థిపై క్రిమినల్ కేసులు ఉంటే పత్రికలు, చానల్స్ లలో ముందస్తుగా ప్రకటన ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయడానికి ప్రతి మండలానికి టీంలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారుల టీంలు జిల్లాలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సీజర్ మేనేజ్మెంట్‌లో నగదు, అక్రమ మద్యం సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల పోటీలో ఉండే అభ్యర్థులు పత్రికలు, టీవీ ఛానల్స్‌లో తమ ప్రచారాలకు ఎంసిఎంసి కమిటీ వద్ద ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా కరపత్రాలు ముద్రించినా, ప్రచారాలకు యాడ్స్ ఇస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేసులు నమోదయ్యాయని తెలిపారు. నగదు తరలించే అంశాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

టిడిపి ర్యాలీని అడ్డుకున్న అధికారులు

అనుమతి కోరాం.. ఇక మీ ఇష్టం అంటూ ముందుకు సాగిన ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన మోటార్ సైకిల్ ర్యాలీని ఆకివీడు సరిహద్దుల్లో ఐ.భీమవరం రోడ్డులో ఆదివారం పోలీసులు అడ్డుకున్నారు. ఐ.భీమవరంలో ఆదివారం సాయంత్రం ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి మంతెన రామరాజుకు గ్రామస్తులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీ ముందుకు సాగగా ఆకివీడు సరిహద్దులో ఎంపిడిఒ ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీని అడ్డుకున్నారు. ఎంఎల్ఎ వాహనాన్నీ ఆపారు. 'మీ ర్యాలీకి అనుమతి లేదు.. ఆపి వేయండి' అంటూ అధికారులు స్పష్టం చేశారు. ఎంఎల్ఎ వాహనం దిగొచ్చి తాము అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని, ఇచ్చి ఉంటారని భావించి ర్యాలీ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు ర్యాలీ ఆపడం సాధ్యం కాదని, అనుమతి వచ్చే వరకూ ఇక్కడే కూర్చుంటామని తెలిపారు. సుమారు 15 నిమిషాల పాటు అధికారులు, ఎంఎల్ఎ, నేతల మధ్య చర్చలు సాగాయి. ర్యాలీ కొనసాగిస్తే కేసు తప్పదని ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ హెచ్చరించారు. 'మీ ఇష్టం.. మీరు తేల్చి చెప్పరు.. మమ్మల్ని కదలనివ్వరు. నా వెనుక ఉన్న కార్యకర్తలను ఆపే పరిస్థితి మా వద్ద లేదు. ఇక మీ ఇష్టం' అంటూ ఆ అధికారిని తప్పించుకుని ఎంఎల్ఎ ముందుకు కదిలారు. దీంతో ర్యాలీ ముందుకు సాగింది. అనంతరం మండల కేంద్రం ఆకివీడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్.టర్నింగ్ వద్ద నేతలు ఎంఎల్ఎకు గజమాల వేసి సత్కరించారు.



ఆకివీడులో ర్యాలీని అడ్డుకున్న అధికారులతో మాట్లాడుతున్న రామరాజు

ఉండి: ఉండి ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆకివీడు మండలం నుంచి ఉండి మండలంలో గ్రామాల మీదుగా మండల కేంద్రం ఉండి చేరుకున్న ర్యాలీకి తెలుగుదేశం శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజుకు గజమాల వేసి సత్కరించారు. రాత్రి 9 గంటల వరకే ర్యాలీకి అనుమతి ఉండటంతో రామరాజు కొద్దిసేపు మాట్లాడి పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాలుకు వెళ్లిపోయారు.



ఉండిలో రామరాజును గజమాలతో సత్కరిస్తున్న నేతలు

ఆర్‌టిసి కార్గోలో డ్రై ఫ్రూట్స్ బాక్సుల్లో నగదు

పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎన్నికల ఖర్చులకో.. లేక నల్లధనమోగాని ఆ నగదు తరలింపు విధానం చూసి అధికారులతోపాటు అంతా ముక్కున వేలేసుకున్నారు. ఈ నగదును తరలిస్తున్న వారెవరూ.. దేని కోసం తరలిస్తున్నారు అనే అంశాలను తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎపిఎస్ ఆర్‌టిసి కార్గో వాహనం హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం వస్తోంది. ఈ వాహనం పట్టణంలోకి ప్రవేశించి పాత పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆ కార్గో వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాలుగు డ్రై ఫ్రూట్స్ పెట్టెల్లో నగదు గుర్తించారు. ఆ నగదును లెక్కించగా రూ.22.63 లక్షలుగా నిర్ధారించి సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని డిఎస్‌పి రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమణ, తదితరులు పాల్గొన్నారు.



నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి బుజ్జి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కర్ కృష్ణ ప్రసాద్ (బుజ్జి) అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత బజార్, మెయిన్ రోడ్డులోని ఫుట్‌పాత్ వ్యాపారులు, చిరు వ్యాపారులను కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నెల రోజుల్లో జగన్‌ను ఇంటికి పంపించేద్దాం

ఆత్మీయ సమావేశంలో ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్



మాట్లాడుతున్న అంజిబాబు

నెల రోజుల్లో జగన్‌ను ఇంటికి పంపించేద్దామని, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు కళ్యాణ మండపంలో జనసేన, టిడిపి, బిజెపి ఆత్మీయ సమావేశంలో అంజిబాబు మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో అడిగితే కేసులు, బెదిరింపులని, అంబేద్కర్, సీతారామరాజు వంటి మహనీయుల విగ్రహాలకు దండలు వేస్తే కేసులు పెట్టడమేంటని, ఈ ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే జనసేన, టిడిపి నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ భయపడొద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని, అరాచక పాలనకు స్వస్తి చెబుదామని తెలిపారు. భీమవరాన్ని అభివృద్ధి చేసుకుందామని, అభివృద్ధికి తోడ్పటునివ్వాలని కోరారు. ట్రాఫిక్, తాగునీరు ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయని, మన ప్రభుత్వంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాట్లాడగా జనసేన రాష్ట్ర నాయకులు వేగేశ్న కనకరాజు సూరి, తదితరులు పాల్గొన్నారు.

గందరగోళం వద్దు.. అభ్యర్థి నేనే

బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం రూరల్: నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థి మార్పు అంటూ గందరగోళం సృష్టించొద్దని, దీనిలో ఎటువంటి మార్పులూ లేవని, తానే అభ్యర్థిగా బరిలో ఉంటానని బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు.

అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులూ లేవు: మాజీ మంత్రి సిద్దార్థనాథ్ సింగ్

పార్టీ అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులు లేవని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నారని మాజీ మంత్రి, ఎపి ఎన్నికల ఇన్‌ఛార్జి సిద్దార్థనాథ్‌సింగ్ అన్నారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి కాదుకదా ప్యాచ్ వర్క్ కూడా చేయని దద్దమ్మ ప్రభుత్వం జగన్‌దని విమర్శించారు. సమావేశంలో గారపాటి తపన చౌదరి, పాకా సత్యనారాయణ, పేరిచర్ల సుభాష్ రాజు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్ : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

దళితుల అభివృద్ధి కోసం ఉన్న 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ దళితద్రోహి అని టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం మండలంలోని పొలమూరు శివారు చెన్నాడచెర్వుకు చెందిన తటస్త దళిత యువకులు పితాని సమక్షంలో టిడిపిలో చేరారు. ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడలను అభివృద్ధి చేసింది టిడిపి అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు పెనుమత్స రాఘవేంద్రరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అలీ చిన్న పాల్గొన్నారు.

నా విజయానికి కృషి చేయండి : ఉమాబాల

ప్రజాశక్తి - ఉండి

దైవజనులంతా తన విజయానికి ప్రత్యేక ప్రార్థనలు చేయాలని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కోరారు. ఆదివారం ఉండిలోని పలు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనల్లో వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్ నరసింహరాజుతో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమాబాల మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ చరిత్రలో తొలిసారిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళకు అవకాశం కల్పించారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మేడిది జాన్సన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


భీమవరం రూరల్ : రోగులకు పండ్లు అందజేస్తున్న సభ్యులు

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శారీరిక, మానసిక ఆరోగ్యం కోసం పోషక, సమతుల్య ఆహారం తీసుకోవాలని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగబుజ్జి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెంలో ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి రొక్కాల ఆశీర్వాదం ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరానికి సరిపడినంత పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటు శరీరానికి అవసరమైన నీరు తాగాలని అన్నారు. తప్పక వ్యాయామం చేయాలన్నారు. బిపి, షుగర్ అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీచర్ కె.కిరణ్మయి, విద్యార్థులు, ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సెయింట్ మెరీస్ ఆసుపత్రి సుపీరియర్ డాక్టర్ సిమిలీ అన్నారు. ఆదివారం విజ్ఞానవేదిక, సెయింట్ మెరీస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం వల్ల అంతుపట్టని రోగాలు వస్తున్నాయని, నిరంతరం ఆరోగ్య రక్షణపై దృష్టి పెట్టాలని అన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాంతకమన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిస్టర్ అనిత్ మాట్లాడుతూ బాలింతలు తమ పిల్లలకు తల్లిపాలు పట్టడం ఆరోగ్యకరమన్నారు. ప్రతిఒక్కరూ కాచిన నీటిని తీసుకోవాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిస్టర్ సెలీనా, సిస్టర్ లీసా, సిస్టర్ ఆర్మదా పాల్గొన్నారు.

గణపవరం : ఎముకల వ్యాధి పట్ల అశ్రద్ధ చేయడం మంచిది కాదని తాడేపల్లిగూడెం లలిత హాస్పిటల్ వైద్య నిపుణులు కంచి కసర్ల సాయివృద్ధి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గణపవరం కమ్యూనిటీ మెడికల్స్ ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్ హెల్పర్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి గణపవరం అధ్యక్షులు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. డాక్టర్ సాయి పృథ్వి మాట్లాడుతూ ఎముకలు కీళ్లు వెన్నుపూస సమస్యలకు అత్యాధునిక వైద్యం చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ సురేఖ మాట్లాడుతూ గర్భిణులకు నార్మల్ డెలివరీ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నిడమర్రు అధ్యక్షులు నిమ్మల సుబ్బారావు, శివ, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.


మహదేవపట్నంలో శివ ప్రచారం

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా : శివ

ప్రజాశక్తి - ఉండి

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని టిడిపి రెబల్ అభ్యర్థిగా ప్రజల ముందుకెళ్తున్నట్లు ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆదివారం మహదేవపట్నంలో రైతుల వద్దకెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటూ గడ్డిమోపులను మోస్తూ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. అనంతరం శివ రామరాజు మాట్లాడుతూ తన హయాంలో మహదేవపట్నం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశానని, దాని ఫలితంగానే గ్రామస్తులు టిడిపి అభ్యర్థులకు మెజార్టీ అందిస్తున్నారని తెలిపారు. ఆక్వా రంగానికి చిరునామాగా ఉండి నియోజకవర్గాన్ని మార్చానని తర్వాత కాలంలో నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. తాను మూడోసారి ఎంఎల్ఎగా విజయం సాధిస్తే నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, నాయకులు గొట్టుముక్కల సత్యవర్మ, మోపిదేవి నాగ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని శివరామరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు : ఎస్ఐ

ప్రజాశక్తి - పాలకోడేరు

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు తప్పదని ఎస్ఐ నాలం శ్రీనివాసరావు హెచ్చరించారు. పాలకోడేరులో ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అంతా సహకరించాలన్నారు. ముఖ్యంగా ఘర్షణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వంటివి చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ఇటువంటి అపోహలకు పోకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నాలం శ్రీనివాసరావు

నీ కడుపు చల్ల'కుండ'..!

మట్టి కుండలకు పెరిగిన గిరాకీ - కొనుగోలుకు జనం ఆసక్తి



ప్రజాశక్తి - కాళ్ల

తరాలు మారుతున్నా సంప్రదాయ మట్టిపాత్రల వినియోగం, విలువ నానాటికీ పెరుగుతోంది. ప్రస్తుత తరుణంలో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్నా వేసవిలో మాత్రం మట్టి కుండలు కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. పేదవాడి ఫ్రిజ్‌గా మట్టికుండలు ప్రాచుర్యం పొందాయి.

జిల్లాలో కరోనా తర్వాత ప్రజల దైనందిన జీవితాల్లో పూర్తిగా మార్పు వచ్చింది. భగభగా మండే ఎండలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని మట్టి పాత్రలోనే నీరు తాగేందుకు ప్రజలు ఇష్ట పడుతున్నారు. ఒకప్పుడు మట్టి కుండలు, మట్టి పాత్రలకు కాలంతో పనిలేకుండా ఫుల్ డిమాండ్ ఉండేది. కాలక్రమేణా మట్టిపాత్రలకు డిమాండ్ తగ్గిపోయింది. కుండలు దీర్ఘకాలిక మన్నిక లేకపోవడంతో ప్రజలు వాటి స్థానంలో లోహపు పాత్రలను వినియోగిస్తున్నారు. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు చాలా మంది చల్లని నీరు తాగేందుకు ఇష్టపడతారు. ఫ్రిజ్‌లో కంటే మట్టి కుండలో నీరైతే ఆరోగ్యకరమని జనం వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కుండల తయారీ, విక్రయాలకు గిరాకీ పెరిగింది.

జిల్లాలో వందల కుటుంబాలకు పైగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లేక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

మార్చి నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ వచ్చిన నాటి నుంచి పగటి వేళ బయట అడుగు పెట్టాలంటే జనం భయపడిపోతున్నారు. ఈ వేడి వాతావరణంలో కూడా ప్రశాంతంగా జీవించడానికి మన పెద్దలు కుండలోని నీరు తాగితే చాలంటున్నారు. మారిన జీవన శైలితో స్టీల్, ప్లాసిక్, పింగాణి పాత్రలు వచ్చేశాయి. దీంతో మట్టి కుండల వాడడం మార్చిపోయారు. ఫ్రిజ్‌లు వచ్చాక వీటిని పక్కన పెట్టేశారు. పూర్వకాలంలో మట్టి కుండలో నీటిని మాత్రమే తాగేవారు. ప్రస్తుత కాలంలో ఎండాకాలం వచ్చిదంటే ఫ్రిజ్ వాటరే తాగుతున్నారు. ఆ నీటిని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

ఫ్రిజ్ నీరు తాగడం వల్ల అకస్మాత్తుగా గొంతు కణాల ఉష్ణోగ్రత పడిపోతుంది. గొంతు నొప్పితోపాటు జలుబు చేసే అవకాశం ఉంది. మట్టి కుండలో నీటి వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది మట్టి కుండలో నీటిని తాగుతుంటారు. వేసవి నేపథ్యంలో పట్టణ, పల్లె ప్రాంతాల్లో సైతం మట్టి కుండలు లభిస్తున్నాయి.


కాళ్లకూరులో మట్టి కుండలు విక్రయిస్తున్న వ్యాపారి

మట్టికుండలోని నీటిలో విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఈ నీటిని తాగడం వల్ల శరీరానికి ఆమ్ల శాతం అందుతుంది.

మట్టి కుండల ధరలు..

20 లీటర్ల మట్టి కుండ ధర రూ.300, 18 లీటర్ల మట్టి కుండ రూ.250, తొమ్మిది లీటర్ల కుండ రూ.150 వరకూ విక్రయిస్తున్నారు.

మట్టి కుండలోని నీరు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు..

వేసవిలో మట్టి కుండలోని నీరు తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిది. అలాగే గొంతు సంబంధిత సమస్యలు రావు. జలుబు, దగ్గు సమస్యలను తగ్గిస్తుంది. వడదెబ్బకు గురికాకుండా ఉంటారు.

మట్టి సేకరించడం కష్టం..

పొన్నపల్లి ముత్తరావు, కుండల వ్యాపారి, కాళ్లకూరు

యంత్రాలు వచ్చిన తర్వాత మా కష్టం చాలా వరకూ తగ్గింది. కుండల తయారీ సులభతరం అయ్యింది. లోహపు పాత్రల వినియోగం వచ్చాక మట్టి కుండల వినియోగం చాలా వరకూ తగ్గినా ఈ కుండల తయారీ సంపూర్ణంగా అంతరించిపోలేదు. మట్టి సేకరించడం చాలా ఇబ్బందిగా ఉంది. ఎంతో కష్టపడి తయారు చేసినా కాల్చేప్పుడు కొన్ని కుండలు పగిలిపోతుంటాయి.


ఆశ్రమానికి మంచాలు అందజేస్తున్న సభ్యులు

వృద్ధాశ్రమానికి మంచాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వృద్ధులకు సేవ చేయడం భగవత్ సేవతో సమానమని పలువురు వక్తలు అన్నారు. జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో వీరమ్మ చెరువు గట్టు వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమానికి దాతల సహకారంతో 3 మంచాలను (రూ.15 వేలు విలువ కలిగిన) ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకులు కొక్కండ వీర బ్రహ్మం మాట్లాడుతూ దాతల సహకారంతో 30 మంది వృద్ధులతో ఆశ్రమం నిర్వహిస్తున్నామని, దాతలందిస్తున్న సహకారం వెలకట్టలేమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్‌కె.చాన్ భాషా, భవాని పాల్గొన్నారు.

సమాజ సేవే మార్నింగ్ కాఫీ క్లబ్ లక్ష్యం

చైతన్య భారతి అధ్యక్షులు భగవాన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజ సేవ చేస్తూ తోటివారికి ఆదర్శంగా నిలవాలని, క్లబ్‌లు ఉత్తమ సేవలందించాలని చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు, రామరాజ భూషణ్ సాహిత్య పరిషత్ కార్యదర్శి రాయప్రోలు భగవాన్ అన్నారు. ఆదివారం స్థానిక అదుర్స్ కన్వెన్షన్ హాల్లో మార్నింగ్ కాఫీ క్లబ్ ఐడెంటి కార్డులను భగవాన్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ క్రేజీ క్లబ్‌గా మార్నింగ్ కాఫీ క్లబ్ పేరు సాధించిందన్నారు. మూడేళ్లుగా మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న సేవలు అద్వితీయమన్నారు. క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు మాట్లాడుతూ మార్నింగ్ కాఫీ క్లబ్ 2021లో ప్రారంభించామన్నారు. క్లబ్ కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ గుప్తా, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఐడెంటీ కార్డు కమిటీ ఛైర్మన్ కురిశేటి నాని, మానేపల్లి రవి చిన్నరావు, కనగర్ల రామకృష్ణ, గుండు సుధీర్ మాట్లాడారు. అనంతరం సభ్యులకు ఐడెంటీ కార్డులు అందజేశారు. ఈ మేరకు భగవాన్‌ను మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మంతెన రామ్ కుమార్ వర్మ, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, కారుమూరి సత్యనారయణ మూర్తి పాల్గొన్నారు.

వార్డుల్లో నాయకర్ ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 17వ వార్డులో ఆదివారం 'మన కోసం మన నాయకర్' కార్యక్రమం నిర్వహించారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఘంటా కృష్ణ, పోలిశెట్టి నళిని పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి : రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మరోసారి తనను ఎంఎల్ఎగా గెలిపించి ఆశీర్వదించాలని ఉండి ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు కోరారు. పెదఅమిరం నుంచి టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి మోటార్ సైకిల్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించే ముందు పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో ఎంఎల్ఎ మంతెన రామరాజు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామరాజు మాట్లాడుతూ 2019లో రాష్ట్రమంతా వైసిపి ప్రభంజనం ఉన్నప్పుడు కార్యకర్తల అండదండలు, ఆశీర్వాదంతో ఎంఎల్ఎగా గెలుపొందానని తెలిపారు. అప్పటి నుంచి రాత్రీ పగలు తేడా లేకుండా కష్టపడి నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చడానికి కృషి చేశానన్నారు. తనకు మూడుసార్లు కరోనా సోకినా ప్రాణాలు సైతం లెక్కజేయకుండా నియోజకవర్గ ప్రజలకు ఆనందయ్య మందు తయారు చేసి పంపిణీ చేశానన్నారు. అయితే ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలు చూసి కార్యకర్తలందరూ అపోహలకు గురవుతున్నారని, తనకు చంద్రబాబు నాయుడుపై ప్రగాఢ నమ్మకం ఉందని, ఎవరూ ఆందోళనకు గురి కావొద్దని సూచించారు. అనంతరం పెదఅమిరం నుంచి మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

వైసిపితోనే రాష్ట్రం అభివృద్ధి : ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్ర అభివృద్ధి వైసిపితోనే పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా మండలంలోని వారతిప్ప గ్రామంలో ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో వైసిపి ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపిటిసి తిరుమాని వరలక్ష్మి పాల్గొన్నారు.


మొగల్తూరు : వారతిప్పలో ప్రచారం చేస్తున్న ప్రసాదరాజు


నరసాపురం : కొప్పర్రులో బద్దావారి పేట నుంచి సోమవారం ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తెలిపారు. **అలాగే** మండలంలోని లక్ష్మణేశ్వరం దేవునితోట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ప్రసాదరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భీమవరం రూరల్ : రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వమే మరలా అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలోని 39వ వార్డుకు చెందిన జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశామన్నారు. అందుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓటు అడుగుతున్నామన్నారు. తాను కరోనా సమయంలో కూడా ప్రజలకు అండగా ఉన్నానని వెల్లడించారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి ప్రసాద్, కోయ శ్రీరామ్మూర్తి, డెక్కల మాణిక్యాలరావు, పిల్లి ముసలయ్య, బొడ్డు దానయ్య, సువ్వాడ ఏసు పాల్గొన్నారు.

ఉండి : ఒక్క ఛాన్స్ ఇవ్వండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్ నరసింహరాజు ఓటర్లను కోరారు. ఆదివారం సాయంత్రం చినపుల్లేరులో గ్రామ అధ్యక్షులు బొర్రా తాతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పివిఎల్ మాట్లాడారు. గత ఎన్నికల్లో విజయం సాధించకపోయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా జగన్మోహన్ రెడ్డి తనను నియమించారని గుర్తు చేశారు. ఒక్కసారి ఎంఎల్ఎగా విజయం అందిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు వీలవుతుందన్నారు. అనంతరం సుమారు పది మంది కార్యకర్తలు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ రామరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

గణపవరం : ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైసిపిని గెలిపించాలని వైసిపి మండల నాయకులు దండు వెంకట రామరాజు కోరారు. అర్ధవరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే తిరిగి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల చెప్పారు. పాలకొల్లు 26వ వార్డులో గుడాల గోపితో పాటు గడపగడపకూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా రాష్ట్రంలో పేదల ఆదాయం గత 5 సంవత్సరాలుగా పెరిగిందని చెప్పారు. అందుకే జగన్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యటనలో వైసిపి నేతలు యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, కర్ర జయ సరిత మద్దా చంద్రకళ, జోగి వెంకటేశ్వరరావు, చినిమిల్లి గణపతి పాల్గొన్నారు.


పాలకొల్లులో ఉమాబాల ప్రచారం

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉండిలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి కంచుకోట ఉండిలో మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. ఆదివారం చెరుకువాడ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షులు వారాడ కొండలరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందన్నారు. వైఎస్ఆర్ హయాంలో 2004లో ఉండి కంచుకోటలో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి సర్రాజు అఖండ మెజార్టీతో విజయం సాధించారని తర్వాత ఉండిలో కాంగ్రెస్ విజయం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందన్నారు. నేడు కాంగ్రెస్‌లోకి పూర్వపు నాయకులందరూ తిరిగొస్తున్నారని కాంగ్రెస్‌కు తోడుగా వామపక్ష నాయకులు ఉండడంతో విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షేక్ కుదాన్ బాషా, నాయకులు ప్రసాద్, నందీశ్వరరావు, బుజ్జి, ఏసు, రాంబాబు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

నరసాపురం : జనసేన సిద్ధాంతాలు నచ్చి నియోజకవర్గంలోని ఎంఆర్‌పిఎస్ నాయకులు జనసేనలో చేరారు. వారికి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెన్నేటి సురేష్, గరికపూడి జేమ్స్ రాజు, తెన్నేటి శేఖర్‌బాబు, బాలం శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: నా ఎస్‌సిలు, బిసిలు అంటూనే వారి సబ్ ప్లాన్ నిధులను మొత్తం దోచుకుని, వారికి వెన్నుపోటు పొడిచిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని జనసేన గూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాకూరి గణేష్, తాడేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో ఎస్‌సి యువకులు జనసేనలో చేరారు. వారికి శ్రీనివాస్ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొలిశెట్టి మాట్లాడారు. జనసేనపై ఉన్న అభిమానం, తనపై ఉన్న నమ్మకంతో పార్టీలో చేరుతున్న అందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి - తణుకు

వైసిపికి చెందిన పలువురు కార్యకర్తలు, నేతలు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద రాధాకృష్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. అర్జునుడుపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు సత్తి కృష్ణారెడ్డి నాయకత్వంలో పార్టీలో చేరడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి

ఐజెయు కార్యదర్శి సోమసుందర్

ప్రజాశక్తి - పెనుమంట్ర

వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి ఒక సమగ్ర ప్రణాళికను ప్రకటించాలని, జర్నలిస్టుల డిమాండ్లను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ వివిధ రాజకీయ పక్షాల నేతలకు విజ్ఞప్తి చేశారు. ఎపి యుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.సాయిబాబా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోమసుందర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు వృత్తి, వేతన భద్రత కల్పించాలన్నారు. జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని కోరామన్నారు. అనంతరం ఎవరు అధికారంలోకి వచ్చినా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలని సోమసుందర్ పిలుపు ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు విఎస్.సాయిబాబా, యూనియన్ జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి పులపర్తి నరసింహారావు, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ పాల్గొన్నారు.

భావితరాల నిర్మాతలు విశ్రాంత ఉద్యోగులు : కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవిష్యత్ తరాల నిర్మాతలు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అని వైసిపి గూడెం ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యన్నారాయణ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు అంటే విజ్ఞులు, మేధావులన్నారు. అభివృద్ధి, సంక్షేమం, మంచి వాతావరణం, ప్రశాంతమైన సంతోషకరమైన జీవనం కావాలంటే మరోసారి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.